# ఆశ

"జయదేవ"

ఆతడు తెరచిన సంచీవైపు చూచాడు భిక్షుకుడు.

వాని కొడలు నిండిన దుస్తులు-నోరు నిండిన తాంబూలం-చేత సంచీ, చిన్న సంచీ మిలమిలా మెరసి పడుతూంది. ఆహా! సృష్టికి ముద్దుకొడుకు! నిండివవాని పొట్ట చూచాడు భిక్షుకుడు. అది పుష్టిగా సన్ననిలాల్చి లోనుండి వట్రువగ పైకి పొటమరించి కనబడుతూంది. అద్భుతమైన కళాప్రజ్ఞను చాటెడి చిత్రశిల్పాన్నివలె రెప్పవేయకుండా వానినీ చూచాడు భిక్షుకుడు. మెచ్చుకున్నాడో, నొచ్చుకున్నాడో వివరింపలేని విషాద సూచకమైన నవ్వు నవ్వాడు. ఆకలిగొన్నవాడేమో- ఆధారం లేని భిక్షుకుడు. వాడు కట్టుకున్న మొల తిరుగని పీలిక-వాడిపోయిన శరీరస్థితీ-బాధనే చూస్తూన్నట్టున్న ముడుతకొలుకులకనులు - వెలవెల బోయే ముఖంతో నెలిబూడిద పూత పెదవులూ—

ఇవన్నీ వాని నర్థిగా చూపుతున్నాయి. ఆ గొప్ప వానికి గౌరవసూచకంగా, కొస్తదూరంలో నిలచే - వాని చూపులలోకి చూచే- నవ్వాడు దీనంగా ఆబిక్షుకుడు - నవ్వేమిటి? వాని పెదవులనుండి కటికరాయి జారినట్టు ఒలికింది పొడిపొడిగా వెలవెలబోతూ. అది నవ్వేకాదు ఏదో బీభత్సం! ఎందు కటు చూడడం? చూచీ చూడనట్టు ఆగొప్పవాడు తల అవ్వలవైపునకు త్రిప్పి, ఎఱ్ఱఎఱ్ఱగా నిర్మలములై నిటారుగా సాగిన వ్రేళ్లమీద వెలుగు నీడలలాగు వెండీరాగీనాణెములు లెక్కిస్తున్నాడు-భిక్షుకునిదృక్కు లా నాణెములలో త్రొట్రువడుతున్నాయి. అంతసంతగొల్లులో కూడా అవి తమ కదలికలో చేసే చిరుచడే ఆ భిక్షుకునికి వినబడుతూంది.

ఆచడి కడ్డుతగిలాడు, వానిచేయి పట్టుకొని "అయ్యా! ఆకలి. రొట్టికొనవూ" అని ఎనిమిదేండ్లబాలుడు—భిక్షుకుడు వాని మట్టిమరకల వెన్నుమీద కొట్టాడు. తన అనుభవలేశాని కడ్డు తగిలాడని కాబోలు!— వానినటు సందరించి తిరుగా ఆగొప్పవాని చేతివైపు చూచాడు - సంచీ, (భూతం) వాతపడిందా సంతోష లేశ ప్రదమయిన ధ్వనికూడా- దానిమూతి కటువుగా, నిర్దాక్షిణ్యంగా బిగిసిపోయింది. దిగాలపడి చూచాడా భిక్షుకుడు గొప్పవాని చేతివైపు, బిగిసి పిడికిట నిమిడిన సంచీమూతికొరకు - ఆశ అలమికొన్న వానిముఖం తేరి చూడనయినా చూడకుండా వెడలిపోతున్నాడా గొప్పవాడు. వానివెంట బడ్డాడు భిక్షుకుడు. ఆభిక్షుబాలకుడు, చాలిచాలనట్టు ముడివైచికొన్న తండ్రి మొల కట్టుపట్టి వెనుకకులాగి- "అటు కాదయ్యా! ఇటుంది రొట్టెల దుకాణం - రా!" అంటూ ఈడిలపడ్డాడు - పుష్టి లేనిపొట్ట నాశ్రయింప నొల్లని ఆపేదవడ్డ పేలికను రెండుచేతులా కూడకట్టికొంటూ, విసువుదలగా ఆ పిల్లవానిని విదలించుకొని, ఆత్రంగా ఆభాగ్యవంతుని సమీపించాడు భిక్షుకుడు. ముందు చూపేగాని వెనుక చూపులేని ఆభాగ్యవంతుడు అక్కడనిలచి, ఒకజపాను బెండురోజా బేరమాడుతున్నాడు - గోడ చెవినేపెడతాడో - కూజాతలనే పెడతాడో దానిని. అలసటగా ఊర్పులుతీస్తూ, దీనంగా "బాబయ్యా!" అన్నాడు - దేవుకుపోయే వానిప్రేవు లన్నీ వెన్నంటుకున్న పొట్ట మీద కనబడుతున్నాయి. కనికరంగా కదలుతూ- సాంధ్యరాగ రేఖాప్రసారమా? ఇంద్రధనుస్సా— ఎవరుచూచారు. ఎవరుగుర్తించారువానిని— ఆ అనుభవము భిక్షుకునిదే — ఆ పిలుపూ భిక్షుకునినోట నాగినట్టే అనన్యవిదితమై అడగిపోయింది — గొప్పవాని చూపులు గులాబీమీద—చెవులు, చిత్రకారునిమీదా ఉన్నాయి.—

మరీదీనంగా, ఆత్రతగా, అలసటగా, "బాబయ్యా" అని చేరువగా నిలిచి చేతులుచాచి వినయంగా వంగి పిలచాడు వానిని భిక్షుకుడు—

ఆ గొప్పవాడు, చీదరించుకొని బొమముడి దూసే సూదిచూపుతో వాని వెగతాళిగ, ఈ సడింపుగ చూచి వానిని కటాక్షించిన ట్టటుతిరిగి మాటాడుతున్నాడు. ఎవరితో ఇంతవర కిలాంటిచూపు లెన్నిటికి గురియైనాడో ఆభిక్షుకు డదివరకు — పైకిమాత్రం పిల్లిలాగు ముడుచుకొనిపోయి రెల్లులాగు వడకాడు—తృష్ణావృత మయిన హృదయంలో రసస్రావ ముంటుందా? భ్రమ మాత్రం లోకానికి ప్రకటిస్తుంది.

తిరుగా ఆ భిక్షుడు "బాబయ్యా" అని ఆ గొప్ప వానివైపు బెదరుగా రెప్పలల్లారుస్తూ జంకుప్రకటిస్తూ వెనుకాడినట్టు చూచాడు.

గొప్పవాడు కోపంగా వెనుదిరిగి చూచి "ఎవడురా నువ్వు—పనీ తోచనీయవు! పాటూ తోచనీయవు!— కాళ్లలోపడి కంగారు పెడుతున్నావు. ఎందు కలా అరుస్తున్నావు చెవిగోసిన మేకలాగు?" అన్నాడు గర్జించి కడ పెడలనున్న వాళ్లు త్రుళ్లిపడేటట్టు.

భిక్షుకుడు — చిన్నబోయినముఖంతో ఒక్క అడుగు వెనుకకు పెట్టి-నడుము మరింతవంచి సలాముచేసి, లేచి పొట్ట వానికి చూపి "ధర్మం బాబయ్యా! ఆకలి!" అని ఏమేమో చెప్పుకోబోతున్నాడు.

గొప్పవాడు ఇంజనుగొట్టంలాగు హుంకరించేడు. 'ధర్మం! ధర్మం! కన్నులేనివానికి ధర్మం! కాలులేని వానికి ధర్మం — దుక్కలా గున్నావు కన్నుగ్రుడ్డా? కాలుసొట్టా? ధర్మమేమిరా! నీలాటివానిచేత డబ్బు పెట్టడం దండుగ-ద్రోహం-అధర్మం పో! మొండిపట్టు పట్టక." అంతకంటె దైన్యంప్రకటించ లేకపోయాడా భిక్షుకుడు. ఇలాటి ఉపన్యాసము లెన్నో సారులు విన్నాడాభిక్షుకుడు తన్నే ఉద్దేశించి ఎందరో చెప్పడం వారివాక్కుల కర్థ ముండేమో! శాస్త్ర చర్చకు తావులేదు. దానివల్ల కడుపుమంట చల్లారదు. రాగిడబ్బు త్యాగిచేయి. ఇంతప్రపంచం ఎందరో వ్యక్తులు, ఎన్నో హృదయాలు - ఆశే చిగురిస్తూంది; కొనసాగి గొడ్డుపూలు పూస్తూంది ఏనా డంకురించిందో ఆ ఆసతీవ, డొంకబలిసి వానిహృదయం నింపేసింది. ఇంకొక ఊహ తూరీగలాగు పైపైని ఎగురవలసిందే గాని ఆశనుమాత్రం తొలగించి వానికి హృదయస్థం కాజాలదు. దీర్ఘమైనదినప్రమాణం జామయినా తరగ లేదు. దీర్ఘతరమయిన ఆయుష్ప్రమాణం మూడవ వంతయినా ముగియలేదాభిక్షుకునకు- వానిని పెన వేసుకొని ప్రేరేపిస్తూన్నది ఆశ. దానికి నిత్యవసంతం- హేమంతశిశిరాలు దాని నంటవన్నట్టు పాకుతూంది వానిలో అదే.

ఆ గొప్పవానిముందు యవనిక పడింది. యాతన రంగంలో ఆభిక్షుకుడూ, ఏడుస్తూ, బూడిద ఒడలితో త్రోవ గుర్తులేకుండా జనాన్ని త్రోసికొని వచ్చే కొడుకూ మిగిలారు.

గంపంతకన్ను, జగచ్చక్షువు ఆశానిమగ్నమయి పోతూంది. గాయపడ్డట్టెబ్బవడ్డదా జగతికన్ను. పశ్చిమాశ రక్తసక్తమయింది. ఏదో ప్రశాంతి తోచిం, దా బింబ పరిసరాలను. ఆసన్నాంధకారం స్ఫురించ దుగా. అది అవ్వలి అవస్థ! అప్పుడు రాగభగ్నమయిం దన్న క్రించుదనంలా గుంటుంది కారుచీకటి. ఇది సహజమయిన సౌభాగ్యమో, దౌర్భాగ్యమో, జరిగి తీరాలి.

మాసిన వెల్లచీరలాగు మసక తెర జంకుజంకుగా జారుతూంది. భిక్షుకుడు శారీరకంగా నీరసంగా నీడ లాగే కదుల్తున్నాడా రంగభూమిలో- చాచినచేతులు వ్రేలకుండా ఉక్కుతీగలు సాగించిందా వ్రేళ్ళలోకి, ఆశ. గొడ్డుతీవలకు బలం లావుగా! మావటిని తప్పించుకున్న మదపుటేనుగలాగు చీకటిచెట్లు జీబుటడవిని చీల్చి మరీ త్రోవ చూపుతూందా భిక్షుకునికి ఆశ. అది వానికి నూత్నావస్థకాదు. అవయవములతో పాటా కదలికా వాని నాశ్రయించుకొనే ఉంది. వస్త్వర్థ మెరుగని పసికూన చూపులకులాగు వానికి తటస్థమయ్యే అవస్థలన్నీ అర్థరహితాలయి అలా చెరిగిపోతున్నాయి. నిరుత్సాహం అపుడెపుడో అంకురించినది మొక్క వరుగుపడి మొరడయి తల్లి కడుపులో తల దాచుకుంది. సూదంటురాయివలె తృష్ణ వానిని ముందున కీడుస్తూంది.

బేరంలేని దుకాణదారుడు సామానులెత్తిపెట్టుకొని-రేపటి కడుపులో లాభం దాచుకొని, కొట్టు

తలుపు మూసికొన్నంత సహజంగా, ముగించాడాభిక్షుకుడు నాటి యాతనాప్రదర్శనదిదృక్షు- ఉన్నది— ఉబ్బించే ఇంకొక ఉషస్సు- పెద్ద కన్నులతో చూస్తుంది రేపటి పగలు- రేపు భాగ్యనిధానం-చిగురు పెట్టబోయే చిన్ని- మొలక- రేపు ఫలించే పంటల వలంతి-ఔను.

ఇల్లా వాకిలా? ఈత తుప్పల మరుగు; నివాసం- చేరుకున్నాడు చేత కఱ్ఱ వాని నంకించుకొని ఆభిక్షుకుడు. వానితో సరిగా నడువలేక ఈడ్గిల పడు తున్నాడా పిల్లవాడు. ఆకలి నిద్రలు కలగలుపుగా వాడు మరింత బరువుగా తోస్తున్నాడు వానిచేతికి- నేల నీడ్చుకొని పోతున్నాడు. గెంటుకొని పోతూన్న పిల్లవాడు 'ఊఁ ఊఁ' అని నీరసంగా మూల్గుతూ ఊర్పులుక్కి బిక్కిరిగా పెడలిస్తూ వాని వెంట దొరలుతున్నాడు- చీకటిని బెదిరించే చుక్క వెలుగులో విరియబోసికొన్న పిశాచీ కేశబంధంలాగు, జల్లుగా వీడబారుతున్నాయి ఆ ఈతతుప్పలముంటి కొమ్మలు. ఆ నడుమ ప్రదేశం, కట్టిడిహృదయంలాగు కటువుబారి- కంటకావృతమై తావుమాత్రం తండ్రి బిడ్డలకు పెట్టింది. నిర్దాక్షిణ్యంగా ఆపిల్లవాని నేలను విడిచాడు. ఏదీ? దాక్షిణ్యం? తానెక్కడకు వెళ్లినా నిర్దాక్షిణ్యం- నిందారోపణ- నీరసం ఇవే వాని చెవుల కలవాటయిన వాక్యాలుగా, హృదయమున కలవాటయిపోయిన ఊహలుగా, శరీరమున కలవాటయిన సంచలనంగా వానిలో లీనమయి పోయినాయి – వాని కది వాయుప్రసారమంత సహజ మయిపోయింది. స్వభావంలో భాగ మయిపోయింది. ఆకటిక నేలనే తానూహూర్చునేందుకు, నేల చదును చేసికొంటున్నాడు. చురుక్కుమన్నది చేతిప్రేలిలో ఈతముల్లు. వాడు నొప్పిగుర్తించలేదు; నొచ్చుకోనూ లేదు- ముల్లూడ దీసికొంటున్నాడు' మునిపంటితో. "అయ్యా రొట్టికొనవూ ఆకలేస్తూంది" అన్నాడా పిల్లవాడు. వాని ప్రార్థన వినినట్టే లేదా భిక్షుకుడు – ఈప్రశ్నే దినారంభమునుండి అప్పటివరకెన్నిసారులు తనచెవిని బడినదో. వాని శ్రోత్రనాళాలు మొద్దువారినవి. ఆ చెవిలో ఆశబ్దం శబ్దించిందిగాని దాని భావంమాత్రం వానికి హృదయస్థం కాలేదు. వాని హృదయంకూడా గాజువారి శబ్దగ్రహణసామర్థ్యాన్ని కోల్పోయినదేమో. అదే అవస్థ అనుదినమూ, అనుక్షణమూ వానిలో రేగడంవల్ల, దానిసూక్ష్మత, తీక్ష్ణత తగ్గి సముద్ర తరంగాలలో సాఫు తేరిన కరకురాతివలె నది నున్నవడిపోయింది. ఆశాతరంగాలలో ఆదరమేమూల? "అయ్యా" పలుకలేదు. "అయ్యా" అని తిరుగా తిరుగా పిలిచాడా పిల్లవాడు. నోటితో ముంటి నూడదీసికొనుచుండుటచేతనో ఏమోగాని వాడు పలుకలేదు. బావురని యేడ్చేడా బాలకుడు. భిక్షుకుని యార్పుకు గొప్పవాని హృదయంవలె వాని హృదయం కాస్తకదలి చీదరను రేపింది. బాలకు డొక యాచకునిలాగు కనబడ్డా డప్పుడు భిక్షుకునికి — వానిలో వాని శరీరమలమేసిన ఆ ప్రశ్నలు భిక్షుకునిలో ప్రతిధ్వనించాయి "కన్నుగ్రుడ్డా? కాలుసొట్టా?" అన్నవి. అతిగా వినుటవల్ల నవే నినదించాయి వానిలో - జనసామాన్యానికి వలెనే వానికీ, పాత్రలక్ష్యంలేదు. అప్పుడు కూడా గాఢంగా అలమింది ఆశ, వానిని- కటిక నేలను చతికిలబడి కూర్చున్నాడు. పిల్లవాని యేడ్పు కీచురాల పాలయినది. చీకటి కడుపులో జీర్ణించిపోయింది. వాడు కూర్కెడో సొమ్మసిల్లేడో-విశ్వమంతా, వింతగా నిద్రపోతూ ఉంటుంది. సుఖ మనుభవిస్తూ ఉంటుంది. నూడిదలు తింటూ ఉంటుంది. అనంతాకాశం చూస్తున్నాడా భిక్షుకుడు. అది వస్తుమయమై భాగ్యవంతునిలాగు కనబడింది. అలవాటుచొప్పున దీనంగా చూచాడాకాశం నీలిముఖంలోకి. చేతులుకూడా చాచాడేమో ఆచుక్క వానికి చుల్కగా చూచి- బొమముడితో "కన్ను గ్రుడ్డా? కాలుసొట్టా?" అని అడిగిన ట్టనిపించింది. చుక్కలవెక్కిరింపులేని పగటి ఆకాశం ఇక రాదా? అని ఆశించాడు- అటు చూచినకొలదీ వానికదేప్రశ్న వినబడుతూంది. మెల్లగా ఆనేల సాగువారాడు. కూర్కుటకు ప్రయత్నించాడు- కన్నులు మూసికొన్నాడు. కన్నుగ్రుడ్డి ఇలాగే! దీనికెంత సత్వం - భాగ్యవంతుని చేతిపైసా నొడిచి తెచ్చే సత్వం ఉంది దీనికి. అందరూ అదేమాట. భిక్షుకుని ఒడల చీమలో ఏవో ప్రాకి కరుస్తున్నాయి. దులిపిన కొలదీ ప్రాకుతున్నాయి అవి- వానికి చికాకు కలిగింది. "నామీదపడి నా

నెత్తురు పీల్చేస్తున్నా యివి — నే నెందుకు వీనికి శరీర మొప్పగించాలి? వీనికి "కన్నుగ్రుడ్డా?" కాలుసాట్టా? అని చీదరించికొని చీమలను దులుపుకొన్నాడు. పగలు తాను యాచించిన గొప్పవారు తన్ను దులపరించినట్టు ఒకడు కాదు—అందరూ పేదవాడు మొదలు లక్షాధికారివరకూ ఆదేప్రశ్న వేసేరు వానిని — రేపు, చుక్క వెక్కిరింపులేనిపగలు—సూర్యుడో — వానికరసహస్రాలు విదలించి నులుపుతూ వానిని దేప్రశ్న అడుగుతాడు.

కూర్చునే కన్నులు గట్టిగా మూసికొన్నాడా భిక్షుకుడు— "కన్ను గ్రుడ్డి," ఇలా గీకన్నులు శాశ్వతంగా మూతలుపడి ఉంటే బాగుండునన్న ఊహావేశం వానిలో తలచూపింది.

జనసమ్మర్దంతో, సౌభాగ్యపుసందడితో క్రిక్కిరిసి కిటకిటలాడే ఆ పట్టణహృదయంలో కనువిప్పి యెరుగని గ్రుడ్డివా డయి తాను తిరుగుతూన్నట్టు—చూచే డాంతరంగికంగా - అందరిమాడ్కలూ తన చూడ్కి లేని కన్నులవైపే చూస్తూనట్టు; వారిచేతులలో నాణెములు గిలగిల లాడినట్టు; చాచిన తన చేతిలో "వహ్వ నాణెములవర్షము" పిడికిలినిండిన డబ్బులు- పినిచుట్టు నిండిన డబ్బులు- ఈతరుప్పలలో డబ్బులు— విశ్వమంతా తన్నే లక్షించింది - నిజమేనా? నిజమే! లోక మంతా ఏకవాక్యంగా చెబుతూన్నది సత్యదూర మెలా గవుతుంది? తాను గ్రుడ్డివాడు కాకుండుట వల్లనే తన చేతికీ దాతచేతికీ దృక్కులు ఉక్కుగోడలయి నిలచేయి — అన్నిటినీ చూచే చూపే అడ్డుగా నిలచింది!

గాలి రంయిమని వీచింది. ఈతతుప్పలకొమ్మలు గలగల లాడినవి — కీచురాలు, కప్పలు- దూరముగా గ్రుడ్లగూబలు- విడివిడిగా కలగలుపుగా ధ్వనిస్తున్నవి. అది ఊరిపొలిమేర - మాపటివేళ - కన్నులు మూసికొని బాహ్యచైతన్యాన్ని గుర్తిస్తూ కలగంటున్నాడు- ఈ సందడి నాటిపట్టణపుసందడిగానే అన్వయించుకుంటున్నాడు — ఆశ వింతపూలు పూస్తూంది. - వెనుకటి గొడ్డుపూలు కావనుకున్నాడు — భిక్షుకుడు కన్నులలా మూసికొనే ఉన్నాడు - అంధత్వం ఇంకా నైజంగా అలవరచు కుంటున్నాడు - "అంధుడు, అంతటిపట్టణపురాటు, రాపిడి, తోడుత్రొక్కుడు - శబ్దాధారంగా, తడవికొంటూ మార్గ మడిగికొంటూ పడుతూ లేస్తూ వెన్నుమీద నేదో వెనకనుండి పడ్డట్టు, వానికి జంకువేసిందా కలలోనే - అంధత్వం - ఏమో! మిన్ను తిరిగి మీదను పడ్డదేమో—"

భిక్షుకుడు జల్లుమని గడగడవడకాడు — దారిద్ర్యమును - ఆశతో కాళ్లేతు లాడకుండ కట్టిపెట్టిన దిట్టరి. ఆశలో ఆకలిబాధను, స ధువుగ నొనర్వగలిగిన సాధకుడు — అంధత్వం, చూపులేమి - కదలుట కసమర్థత—

ఆ యీతరుప్పలలో తానంధుడై ఆకలికి చిక్కి శిథిల మయిపోతూన్నట్టు - చీమలూ - నక్కలూ తన శరీరమును చీల్చి తినుచున్నట్టు ఏవో భావిపటం వానికి హృద్గోచర మయింది - భయపడ్డవానివలె కన్నులు దడుక్కున తెరచాడు - విశ్వ మంతా! ఆ మాపటివేళ క్రిమిపక్ష్యాదులు చేసేధ్వనితో "కనుగ్రుడ్డా?" అని అడుగుతూంది - మంచికలనుండి మెలకువ వచ్చింది వానికి— తిరుగా ఆ కలలో ప్రవేశించి ఆనందలేశ మనుభవించ లేకుండా ఉన్నాడు - భయానకం వాని చైతన్యాన్ని మరింత వాడిగా చేసేసింది - రెప్పపాటుకూడా వానికి శాశ్వతాంధత్వాన్ని స్ఫురింపచేస్తూంది. అలా తెరచిన కన్నులతో ఆ చీకటిలోకి చూస్తున్నాడు నిలింపుడై, నిర్విణ్ణుడై, ఆ భిక్షుకుడు—

కాదన్నట్టు తలయూచాడు- చెదరినకొమ్మల ఈ తరుప్పలనడుమవానితుప్పతలయూపెవడు గుర్తించాడు. అదికాక, అంధు డయినవాడు సత్వహీను డయి పోతున్నాడు. ఎవరికా అవలింపులక్ష్యం? తన ఇంద్రియాలే తన కవశమై యెదుర్కొంటున్నా యనుకుంటున్నాడా భిక్షుకుడు. తన అంధత్వం నిజంకాదు. ధైర్యలేశం పొడమింది. ఆ అంధత్వమిచ్చిన ఆనందం మరి తనకు లేదు. దైన్యలేశం పొడమింది—ధైర్యం దైన్యాన్నీ, దైన్యం ధైర్యాన్నీ మ్రింగుతున్నాయి క్రమక్రమంగా వానిలో-ఆసంఘర్షణలో, ఆ అన్యోన్యగ్రహణావేశంలో — సాగి ముడిగి వానిహృదయం సత్వహీన మయిపోతూంది. ఏ అవస్థ నాశ్రయించ

డమో దానికి తెలియక కొట్లాడి కొట్లాడినిలిచిపోతూంది క్షణకాలం—వా డొకకాలు అంఘత్వంలోనూ, ఒక కాలు ఆపదలోను పెట్టి కూర్చున్నాడు- వానిజీవ మప్పు డాశాసక్పంపడగనీడ నుంది—హృదయ మాగి పోయినా వాడు గుర్తించడు. కాని అది ఆగిపోలేదు. మల్లయుద్ధానంతరరంగంవలె వానిహృదయాన శూన్యత ఆవరించింది. ఊహాలేశంకూడా కదలలేదు. ఆనిశా గర్భంలో కీచురాయి గీపెట్టలేదు. దూరపు జలా శయాలలో కప్ప లార్వలేదు. చీకటిపండుగచేసికొనుట కాగ్రుడ్లగూబలూ ఎటోవాహ్యాళి పోయినవి కాబోలు. గాలి ఎక్కడితరంగ మక్కడ సొమ్మలిసి అడగి పోయింది. ఈతరుప్పలు మూతులు బిగించికొని ఊర్పులు బిగియబట్టి ఏమో వింటున్నాయి. భిక్షుకునియొడల బ్రాకిన పిపీలికలుసైతం బిలా లలో పొంచినవి. ఊర్పులుసైతం బాహాటంగా తీయ జంకుతున్నా డా భిక్షుకుడు - చైతన్యం - జీవ లక్షణం - ఏవీ ఎక్కడా తోచదు. నిరాఘాటంగా, నిర్లక్ష్యంగా, నీరసాన్ని చీకికొనక నిద్రపోతూన్న ఆభిక్షుకుని బిడ్డడు - మాత్రం చిరుగురక లెడు తున్నాడు. అది సముద్రపు హోరులాగు కదలు తూం డా తుప్పలనడుమ - భిక్షుకుని కాలుచేతులు గదలినవి - అన్యసంచలనంకోసం అటూ యిటూ చూచాడు-అలవాటు వానికి-ఈతరెమ్మ చేయాచింది- చీదరించుకొని - ఉబ్బి వెడలని ఉడుకుబోతుదనంతో- ఆరెమ్మ ఆకులు - కటువుగా కఠినంగా చిదిమేడు - రెండు - మునువ్రేళ్ల వానిని ముంటికొనలు పైకుంచి చూచేడు- వాని వాడి వానికి చీకటిలో కనబడలేదు- (కనబడునా? - ఏమో) వాని సత్వం- అనుభవమువలన వానికి హృద్గోచరమవుతూంది - దిగ్గనలేచేడు - సాహ సించినట్టు "ఉఁహుఁ" అన్న తెగింపుమూల్గు, వాని పెదవులసందున కాక, ముకుపుటములనుండి వెడలింది. ఈతరుప్పగడ గడలాడింది. గాలి, రొదతో తరుకోట రాలలో మూల్గింది - ఆకసమున చుక్కలు మబ్బు చాటునకు పోతున్నాయి. ఆప్రశాంతిలో అంతా అల జడిలాగే తోచింది. భిక్షుకునికి ముఖమే లేదేమో ఆ చీకటిలో కలసిపోయినది. వాని అడుగులు - దడదడ - అక్కడి కక్కడే వడి, అలజడి పైపాటు:— ఏమిటో ఆభిక్షుకుడే గుర్తించలేదు. ఉస్సు రన్నాడు - హుంక రించాడు - దేనితోటో పెనగినట్టు గింజుకున్నాడు.

* * *

అవ్వలినిశాభాగం ఆర్తనాదంతో తెల్లబో యింది. ఆ తుప్పలో మొఱ్ఱోమొఱ్ఱో మన్న - ఆపన్న కంఠరవం - బాధాసూచకమయిన బావురన్న ఎడ తెగని మొఱ్ఱ - ఏడ్పు ప్రేవులుత్రెంచే పిన్నయెలుగు- భిక్షుకుని బిడ్డడు - గడగడలాడిపోయి గ్రుక్కలు మర లింపలేకుండా గోలపెట్టి యేడుస్తున్నాడు - నిశా గర్భం కరగి వరదలై పారేటట్టు.

